పంటల తెగుళ్లను సకాలంలో గుర్తించాలి

- డీఆర్‌సీ సలహా మేరకు నివారణ చర్యలు చేపట్టాలి
- పంటను ఆశించిన తెగులు, చీడపీడల చిత్రాలను తీసి సీఎల్‌ఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి
- వ్యవసాయ సహాయకులకు ఏడీఏ జాహ్నవి సూచన

- వార్త 8వ పేజీలో..

ఆదివాసీ రైతులకు గోకులాలు

- తొలి విడతగా మండలానికి 25 షెడ్లు కోసం ప్రతిపాదన
- చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల నుంచి 40కి పైగా దరఖాస్తులు
- ఆసక్తి చూపుతున్న రైతులు
- పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖరరావు


చింతపల్లి, ఆగస్టు 28: ఆదివాసీ రైతులకు గోకులాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖరరావు తెలిపారు. బుధవారం స్థానిక ఏరియా పశువుల ఆస్పత్రిలో పశువులకు ఆయన ప్రత్యేక ఆరోగ్య తనిఖీలు చేసి చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు గోకులాలు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలను కోరిందన్నారు. తొలి విడతగా ఒక్కొక్క మండలానికి 25 గోకులాలు చొప్పున ప్రతిపాదనలు పంపిస్తున్నామన్నారు.



డాక్టర్ చంద్రశేఖరరావు

రెండో విడత నిధుల లభ్యత ఆధారంగా ఇతర రైతులకు అదనంగా గోకులాలు మంజూరు చేస్తామన్నారు. రెండు పశువులకు రూ.1,15,000, నాలుగు పశువులకు రూ.1,85,000, ఆరు పశువుల షెడ్లకు 2,30,000 నిధులు కేటాయించారన్నారు. ఈ యూనిట్ ధరలో రైతుకి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.90 శాతం నిధులు అందజేస్తారన్నారు. రైతు 10 శాతం నగదు చెల్లించాల్సి వుంటుందన్నారు. 20 గొర్రెలు, మేకల షెడ్లకు రూ.91,000, అలాగే 50 గొర్రెలు, మేకలకు రూ.2.30,000 నిధులు కేటాయించినట్టు చెప్పారు. ఈ యూనిట్ ధరలో ఉపాధి హామీ పథకం ద్వారా 70 శాతం నిధులు చెల్లిస్తారని, రైతు 30 శాతం పెట్టుకోవాల్సి వుంటుందన్నారు. 100 కోళ్ల షెడ్డుకు రూ.87,000, అలాగే 200 కోళ్ల షెడ్డుకు రూ.1,32,000 నిధులు కేటాయించారని, ఈ నిధుల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి 70 శాతం నిధులు అందుతాయని, రైతు 30శాతం నిధులు పెట్టుకోవాలన్నారు. పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్ల షెడ్ల కోసం చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల నుంచి 40కిపైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

షెడ్ల నిర్మాణాలకు రైతులు ఆసక్తి చూపుతున్నారన్నారు. ప్రస్తుతం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామన్నారు. చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో 1.40 లక్షల పశువులు ఉండగా, ఇప్పటి వరకు 35 వేల పశువులకు టీకాలు వేశామన్నారు. రైతులు ప్రతి పశువుకి టీకాలు వేయించాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో పశువులు, గొర్రెలు, మేకల్లో చిటుకువ్యాధి, తుమ్ములు, దగ్గు, వాసనతో కూడిన విరేచనాలు కలిగే అవకాశముందన్నారు. పశువులు, గొర్రెలు, మేకల్లో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశువైద్యశాలకు వచ్చి మందులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ అప్పారావు పాల్గొన్నారు.



మంత్రి నారా లోకేశ్‌కు విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు. చిత్రంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ఉన్నారు

లోకేశ్‌కు ఘన స్వాగతం

- ఎయిర్‌పోర్టుకు భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- కార్యాలయంలో రాత్రికి బస

విశాఖపట్నం , ఆగస్టు 28: రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం రాత్రి నగరానికి చేరుకున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి విశాఖ విచ్చేసిన ఆయనకు విమానాశ్రయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, విశాఖపట్నం, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గాల పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, పార్టీ నాయకులు కిడారి శ్రావణ్‌కుమార్, బుద్ద నాగజగదీశ్, దాడి రత్నాకర్, ప్రగడ నాగేశ్వరరావు, సీతంరాజు సుధాకర్, పీలా శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, విశాఖపట్నం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, గోపాలపట్నం తహసీల్దార్ రమేష్, తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

కార్యకర్తలతో ఫొటోలు

ఎయిర్‌పోర్టులో లోకేశ్‌తో మాట్లాడి ఫొటోలు దిగేందుకు ఎక్కువమంది వచ్చారు. అయితే భద్రతా కారణాలతో సిబ్బంది వారిని దూరంగా ఉంచారు. ఇది చూసిన లోకేశ్ స్పందిస్తూ...వారిని వదిలేయండి...నేనే మేనేజ్ చేస్తానన్నారు. అప్పుడు భద్రతా సిబ్బంది అందరిని లోకేశ్ వద్దకు అనుమతించడంతో వారందరితో ఫొటోలు దిగారు.

పార్టీ కార్యాలయంలో బస

ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా లోకేశ్ నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆయనతోపాటు పల్లా శ్రీనివాసరావు, శ్రీభరత్, గండి బాబ్జీ తదితరులు ఉన్నారు. పార్టీ కార్యాలయం ఆవరణలో గల బస్సులో ఆయన రాత్రి బస చేశారు.

ఎట్టకేలకు రహదారుల విస్తరణకు మోక్షం

- నేషనల్ హైవే అథారిటీతో పనులు చేపట్టేందుకు నిర్ణయం
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక నిధులిస్తామని చెప్పినా కార్యరూపం దాల్చని వైనం
- విస్తరణపై కనీసం ఉత్తర్వులు జారీ చేయని గత ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వ హయాంలో కదలిక

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

ఎట్టకేలకు జిల్లా కేంద్రం పాడేరులోని ప్రధాన రహదారుల విస్తరణకు మోక్షం కలిగింది. దీంతో నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్ నుంచి విశాఖపట్నం, అరకులోయ, చింతపల్లి మార్గాల వైపు కిలో మీటరు విస్తీర్ణంలో రోడ్డు విస్తరణ చేయాలని భావిస్తున్నారు. 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పాడేరు మెయిన్ రోడ్డు విస్తరణకు రూ.47 కోట్లు మంజూరు చేసింది. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దానిని రద్దు చేసింది. దీంతో మెయిన్‌రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం హయాంలో నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో విస్తరణను నోచుకోనుంది.



పాడేరు మెయిన్ రోడ్డు వ్యూ

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో అప్పటి కలెక్టర్ సుమిత్‌కుమార్ అభ్యర్థన మేరకు స్థానిక రోడ్డు విస్తరణకు ప్రత్యేకంగా నిధులు ఇస్తామని అప్పటి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్ రెడ్డి ప్రకటించారు. ఉన్నతాధికారుల సూచనలతో మెయిన్‌రోడ్డు విస్తరణకు అవసరమైన డీటైల్ ప్రాజెక్టు రిపోర్టు రూపొందించడంతోపాటు రూ.30 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించారు. కానీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఉత్తర్వులు రాలేదు. మెయిన్‌రోడ్డు విస్తరిస్తామనే ఆలోచనతో అధికారులు అప్పట్లో రోడ్డుకు ఇరుపైపులా ఉన్న ఆక్రమణలు తొలగించారు. అయితే వైసీపీ ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో మెయిన్ రోడ్డు విస్తరణకు నోచుకోలేదు.

నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో విస్తరణ పనులు

జిల్లా కేంద్రంలోని మెయిన్‌రోడ్ల విస్తరణను రాష్ట్ర ప్రభుత్వం రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టాలని 2016లోనే ప్రతిపాదించారు. దీని కోసం 2018లోనే రూ.47 కోట్లు మంజూరు చేశారు. ఆ తరువాత 2023లో వైసీపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేసి విఫలమైంది. తాజాగా ప్రస్తుత కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ మెయిన్‌రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు రూపొందించాలని రోడ్లు, భవనాల శాఖాధికారులను ఇటీవల ఆదేశించారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణ నేషనల్ హైవే ... మిగతా 8వ పేజీలో



విస్తరణకు సెంటర్ పాయింట్‌గా భావించే అంబేడ్కర్ సెంటర్

కలెక్టర్ సుడిగాలి పర్యటన

- తుంపాడ, అల్లివర, బూరుగుచట్టు, డల్లాపల్లి గ్రామాల సందర్శన
- డల్లాపల్లిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని హామీ
- సప్పిపుట్టు, డల్లాపల్లి రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఆదేశం



అల్లివర పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పాడేరు మండలంలో కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని కోట్లగరువులో నూతన పాఠశాల భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన తుంపాడ, అల్లివర, బూరుగుచట్టు, డల్లాపల్లి గ్రామాల్లో ఉదయం పదకొండు గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు పర్యటించారు. తుంపాడ గ్రామంలో తాగునీటి సమస్య ఆయన దృష్టికి రావడంతో అక్కడ తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఉన్న చెరువును పరిశీలించారు. తరువాత అల్లివర గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులకు నిర్వహించిన బేస్‌లైన్ టెస్ట్ ఫలితాలపై ఆరా తీశారు. వెనుకబడి ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, వారిని ముందు గ్రేడులోకి తీసుకువెళ్లేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అక్కడ విద్యార్థులతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. తరువాత బూరుగుచట్టు, డల్లాపల్లి గ్రామాలను సందర్శించారు. అటువైపు సప్పిపుట్టు, డల్లాపల్లి ప్రాంతాలకు వేర్వేరుగా జాతీయ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని, నవంబరు నాటికి రోడ్డు పనులు పూర్తికావాలన్నారు.



డల్లాపల్లి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

డల్లాపల్లి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

మండలంలో సుందర ప్రదేశంలో ఉన్న డల్లాపల్లిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఎత్తైన సుందర ప్రదేశంలో ఉన్న డల్లాపల్లిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారని, అనివార్యకారణాలతో అవి ప్రారంభంలోనే ఆగిపోయాయని పలువురు కలెక్టర్‌కు తెలిపారు. స్పందించిన కలెక్టర్ భవిష్యత్తులో డల్లాపల్లిని చక్కని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని, రిసార్టుల నిర్మాణం, సాహస క్రీడల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. వంజంగి తరహాలోనే ఒక ప్రత్యేక అధికారిని నియమించి, స్థానిక గిరిజనులతోనే ఒక కమిటీని ఏర్పాటు చేసి పర్యాటకాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. అలాగే పాడేరు-విశాఖపట్నం మెయిన్‌రోడ్డునుంచి డల్లాపల్లి వరకు వున్న ఐదున్నర కిలోమీటర్ల రోడ్డు నిర్మాణాన్ని నవంబరుకు పూర్తి చేయాలని, మరింత వెడల్పుగా రోడ్డు నిర్మించాలని పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ శాఖ ఈఈ టి.కొండయ్యపడాల్, ఎంపీడీవో సాయినవీన్, ఎంఈవో సీహెచ్.సరస్వతి దేవి, తదితరులు ఉన్నారు.



బదిలీల కోసం..

- ప్రజా ప్రతినిధులతో సిఫారసులు, ఫోన్లు
- దరఖాస్తుల స్వీకరణకు 24వ తేదీతో ముగిసిన గడువు
- వరుస సెలవులు వచ్చాయనే ఉద్దేశంతో ఇంకా స్వీకరణ
- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహణ
- ఎంపీడీవో పోస్టుల కోసం పలువురు పైరవీలు
- జిల్లాలో ఒకరిద్దరు తహసీల్దార్లకు స్థాన చలనం
- పౌరసరఫరాల శాఖలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు పోటీ

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో బదిలీల హడావిడి మొదలైంది. కొత్త ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తరువాత తొలిసారి జరిగే బదిలీల్లో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉంటుందనేది బహిరంగ రహస్యం. ప్రస్తుతం బదిలీ కోరుకునే అధికారులు, ఉద్యోగులు కూడా తమకు తెలిసిన వారి ద్వారా సిఫారసు చేయించుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలో మంత్రులు/ఎంపీలు/ఎమ్మెల్యేల ... మిగతా 8వ పేజీలో

మన్యంలో జొల్డ సందడి

వరి నాట్లు పూర్తయిన తరువాత చేసే తొలి వ్యవసాయ పండగ

- ఈ పండగ చేస్తే పంటలకు చీడపీడలు పట్టవని గిరి రైతుల నమ్మకం

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

మన్యంలో గిరిజన రైతులు జొల్డ పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. దీంతో పంట పొలాల్లో జొల్డ పండగ సందడి నెలకొంది. మైదాన ప్రాంతాలకు భిన్నంగా, ఇతరులకు ఆసక్తి కలిగేలా గిరిజనుల ఆచార వ్యవహారాలు ఉంటాయి. వాటిపై గిరిజనులు తరతరాలుగా విశ్వాసం ఉంచి, పాటిస్తూనే ఉంటారు. అటువంటి వ్యవహారాల్లో ఒకటిగా జొల్డ పండగను చెప్పుకోవచ్చు.

ఏజెన్సీలో గిరిజనులు వరి నాట్లు పూర్తయిన మూడు వారాలకు జొల్డ పండగను నిర్వహిస్తారు. ప్రతి గిరిజన రైతు విధిగా ఈ పండగను బుధవారం మాత్రమే నిర్వహించాలనే నిబంధన తరతరాలుగా కొనసాగుతున్నది. దీంతో వరిసాగు చేసే ప్రతి రైతు నాట్లు పూర్తయిన 21 రోజుల తరువాత వచ్చే బుధవారం నాడు కచ్చితంగా జొల్డ పండగను ఆచరిస్తారు. ఈ బుధవారం పాతపాడేరు, కొత్తపాడేరు గ్రామాల్లో జొల్డ పండగను ఘనంగా నిర్వహించారు.



పాడేరు శివారు పొలాల్లో జొల్డ కొమ్మలను నాటి పూజ చేస్తున్న కొత్తపాడేరు రైతు ఉమామహేశ్వరరావు

జొల్డ పండగ ఎలా చేస్తారంటే?

గిరిజన రైతులు వరి నాట్లు పూర్తయిన మూడు వారాల తరువాత అడవుల్లోకి వెళ్లి కస్మి, సీడి, పెద్ద జొల్డ మొక్కల కొమ్ములను తీసుకువస్తారు. ఇంటి వద్ద లేదా గ్రామ సావిడి వద్ద కోడిని కోసి, దాని రక్తాన్ని బియ్యంలో కలిపి అక్షింతలు చేస్తారు. అలాగే అన్నంలో సైతం పసుపు, కోడి రక్తం కలుపుతారు. వాటిని అడవుల నుంచి తీసుకువచ్చిన కొమ్మలను పట్టుకుని ఇంటిల్లపాది తమ పంట పొలాలకు వెళతారు. అక్కడ దేవతలకు మొక్కి తరువాత అడవుల నుంచి తీసుకువచ్చిన మొక్కల కొమ్మలను పంట పొలాల్లో పాతుతారు. అలాగే పూజ చేసి తీసుకువచ్చిన అక్షింతలు, అన్నం మెతుకులను సైతం పంట పొలాల్లో చల్లుతారు. ఇలా చేయడం వల్ల పంట బాగుంటుందని, లేకుంటే పంట పాడవుతుందని గిరిజన ... మిగతా 8వ పేజీలో



డముకు వారపు సంతలో విక్రయానికి సిద్ధంగా ఉన్న సీతాఫలాలు

సీతాఫలం ధర పతనం

- డముకులో ఈ నెల మొదటి వారంలో క్రేట్ ధర రూ.700-800
- ఈ వారం రూ.150- 200 ధర పలకడంతో రైతుల గగ్గోలు

అనంతగిరి, ఆగస్టు 28: మండలంలోని డముకు బుధవారం సంతలో ఈ వారం సీతాఫలం ధర పతనమైంది. ఈ నెల మొదటి వారంలో క్రేట్ ధర రూ.700 నుంచి రూ.800 పలకగా, ఈ వారం రూ.150 నుంచి రూ.200లకు ధర పడిపోయింది. దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. కూలి డబ్బులు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏజెన్సీ వ్యాప్తంగా మిగతా మండలాలతో పోలిస్తే అనంతగిరి మండలంలోనే సీతాఫలం అధికంగా పండుతుంది. రుచి కూడా బాగుంటుంది. దీంతో మైదాన ప్రాంత వాసులు కాశీపట్నం, డముకు వారపు సంతలకు వచ్చి సీతాఫలాన్ని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతారు. మైదాన ప్రాంతాల్లో దొరికే సీతాఫలం కూడా ఇక్కడ విక్రయిస్తున్నా ఏజెన్సీ ఫలాలకే ఎక్కువ మంది ఆసక్తి చూపుతారు. డముకు వారపు సంతకు జెండాగరువు, మద్దిగరువు, వాలసీ, నిమ్మలపాడు, చీమగెడ్డ, పోర్లబంధ, పుట్టపాడు, గుమ్మ, ధనకోట, పెద్దబిడ్డ తదితర గ్రామాలను నుంచి సంతకు సీతాఫలం వచ్చింది. ఈ నెల మొదటి వారం నుంచి మూడవ వారం వరకు ... మిగతా 8వ పేజీలో



డముకు వారపు సంత నుంచి మైదాన ప్రాంతానికి వ్యాన్‌లో సీతాఫలాలు తరలిస్తున్న దృశ్యం

క్రైం... crime news

హత్య కేసులో నిందితుడి అరెస్టు

మాకవరపాలెం, ఆగస్టు 28 : మండలంలోని తాడపాల లో జరిగిన హత్య కేసులో నిందుడు గనిశెట్టి దొరబాబును అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. తాడపాలలో రెండు కుటుంబాల మధ్య జరిగిన భూతగాదాలో నగిశెట్టి జోగినాయుడు, చిన్న, భాస్కరరావుతో దొరబాబుల మధ్య సోమవారం అర్ధరాత్రి జరిగిన గొడవలో జోగినాయుడు మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు నిందితుడు దొరబాబును అరెస్టు చేశారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి జైలు, జరిమానా

పరవాడ, ఆగస్టు 28: జిల్లాలోని పలు ప్రాంతాల్లో పగటి పూట ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడిన వ్యక్తికి ఎనిమిది నెలలు జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు పరవాడ సీఐ బాలసూర్యారావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పిళ్లా నూకరాజు పరవాడ మండల పరిధిలోని మంత్రిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో దొంగతనానికి పాల్పడ్డాడు. అప్పటి సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు, క్రైమ్ టీమ్ ఏఎస్ఐ నాయుడు, కానిస్టేబుళ్లు నాయుడు, నాగేంద్ర మాటు వేసి ఈ ఏడాది ఏప్రిల్ ఒకటిన నిందితుడు నూకరాజును పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయమై బుధవారం అనకాపల్లి కోర్టులో హాజరుపరచగా నిందితుడు నేరం చేసినట్టు రుజువు కావడంతో అనకాపల్లి 11వ అదనపు తరగతి మేజిస్ట్రేట్ ఎ.రమేష్ పై విధంగా తీర్పు వెల్లడించినట్టు సీఐ తెలిపారు.

అంతర్ జిల్లాల దొంగ అరెస్టు

» ఒంటరి మహిళలే టార్గెట్


నిందితుడు లక్ష్మణనాయుడు

గాజువాక (విశాఖపట్నం), ఆగస్టు 28: ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసుకుని వారిని మాయ మాటలతో నమ్మించి మత్తు మందు ఇచ్చి నగదు, బంగారు ఆభరణాలను కాజేస్తున్న కొట్టిన లక్ష్మణనాయుడు అనే అంతర్ జిల్లాల దొంగను విశాఖలోని గాజువాక పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 24న వడ్లపూడి ప్రధాన మార్గంలో కూరగాయలు విక్రయించే ఓ మహిళ వద్దకు లక్ష్మణనాయుడు వచ్చి మాటలు కలిపాడు. అనంతరం అక్కడ ఉన్న షాపు నుంచి చెరకు రసం తెచ్చి ఆమెకు ఇచ్చాడు. అది తాగాక ఆమె ఇంటికి వెళ్లి అపస్మారక స్థితికి వెళ్లిపోయింది. ఆ మర్నాడు ఉదయం లేచి చూసేసరికి ఆమె మెడలో ఉండాల్సిన బంగారు గొలుసు, ఇతర ఆభరణాలు, బీరువాలోని బంగారు వస్తువులు, నగదు, ఏటీఎం కార్డు కనిపించలేదు. దీంతో తమ ఇంట్లో రాత్రి దొంగతనం జరిగిందంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇటువంటి నేరాలు ఇటీవల నగరంలో అధికమవుతున్నట్టు గుర్తించిన పోలీస్ ఉన్నతాధికారులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. క్రైమ్ డీసీపీ సీహెచ్ శ్యామలరావు, సౌత్ డివిజన్ క్రైమ్ సీఐ కె.శ్రీనివాసరావులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. కూరగాయల దుకాణం వద్దకు వ్యక్తి గురించి ఆరా తీశారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడు శ్రీకాకుళం జిల్లా పాలకొండ సమీపంలోని బాసుర ప్రాంతానికి చెందిన కొట్టిన లక్ష్మణనాయుడుగా గుర్తించారు. ఈ క్రమంలో లక్ష్మణనాయుడు మంగళవారం ఇక్కడి రాజీవ్‌నగర్ బ్రిడ్జి వద్ద ఉన్నట్టు పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుని వద్ద నుంచి బంగారు చైను, మూడు తులాల ఇతర ఆభరణాలు, కొన్ని ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇప్పటికే నిందితుడిపై గాజువాక, పెందుర్తి, విశాఖ టూ టౌన్, విజయనగరం, కాకినాడ జిల్లా సామర్లకోట, అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట, శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయి.

ఆ మృతదేహం వేటజంగాలపాలెం మహిళది

కొత్తూరు, ఆగస్టు 28 : అనకాపల్లి పట్టణానికి ఆనుకుని ఉన్న శారదా నదిలో మంగళవారం లభ్యమైన మృతదేహం వివరాలు గుర్తించినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. అనకాపల్లి మండలం వేటజంగాలపాలెం పంచాయతీ క్వారీ కాలనీకి చెందిన మడక పైడమ్మ (75)గా గుర్తించామన్నారు. ఈమె మృతికి గల పూర్తి కారణాలు విచారణలో తేలాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

» విద్యార్థులకు తప్పిన ముప్పు



నక్కపల్లి, ఆగస్టు 28 : మండలంలోని రాజయ్యపేట సమీపం హెటెరో పరిశ్రమకు ఆనుకుని ఉన్న రహదారిపై బుధవారం సాయంత్రం కళాశాల విద్యార్థులతో వెళుతున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. నక్కపల్లి నుంచి బుచ్చిరాజుపేట, రాజయ్యపేట గ్రామాలకు కొందరు విద్యార్థులు ఆటోలో వెళ్తుండగా, మార్గ మధ్యలో ఉన్న మలుపు వద్ద ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, ముగ్గురు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 28 : పట్టణంలోని చినరాజుపేటకు చెందిన వృద్ధురాలు అదృశ్యమైనట్టు బుధవారం ఫిర్యాదు అందిందని ఎస్ఐ మహ్మద్ అలీ తెలిపారు. అలంక నూకరత్నం అనే వృద్ధురాలు ఆరోగ్యం బాగోలేక పోవడంతో మందులు వాడడం లేదని కొడుకు మంగళవారం ఉదయం కోపగించుకున్నాడన్నారు. దీనికి మనస్తాపం చెందిన ఆమె ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయినట్టు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు ఆమె కుమారుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

కిరండోల్ రైళ్లు దంతెవాడ వరకే...

విశాఖపట్నం, ఆగస్టు 28: బచేలి, కిరండోల్ మధ్య భారీ వర్షాలు కురుస్తున్నందున విశాఖ- కిరండోల్ మధ్య నడిచే రైళ్ల గమ్యాలను విశాఖ, దంతెవాడ మధ్య కుదించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖ నుంచి కిరండోల్ వెళ్లే 08551 నంబరు గల పాసింజర్ రైలు, 18514 నంబరు గల నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 29 నుంచి వచ్చే నెల నాల్గో తేదీ వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలో 08552 నంబరు గల పాసింజర్ రైలు, 18513 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 30 నుంచి వచ్చే నెల ఐదో తేదీ వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తాయని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలు తాత్కాలికంగా రద్దు చేసినట్టు వివరించారు.

నాందేడ్, హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌లకు శాశ్వత అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, ఆగస్టు 28: ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ- అమృతసర్ మధ్య నడిచే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌లకు, విశాఖ-నాందేడు మధ్య రాకపోకలు సాగించే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు శాశ్వత ప్రాతిపదికన అదనపు కోచ్‌లు జత చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సెప్టెంబరు మూడు నుంచి విశాఖ - అమృతసర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు (20807) ఒక స్లీపర్, ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లు, సెప్టెంబరు ఏడు నుంచి అమృతసర్- విశాఖ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు (20 808) ఒక స్లీపర్, ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లు అదనంగా అందుబాటులోకి వస్తాయి. ఇక సెప్టెంబరు మూడు నుంచి విశాఖ- నాందేడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు (20811) ఒక స్లీపర్, ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్, సెప్టెంబరు నాలుగు నుంచి నాందేడు - విశాఖ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు (20812) ఒక స్లీపర్, ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లు అదనంగా అందుబాటులోకి రానున్నట్టు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	91.00
లైవ్ ధర	111.00
విత్ స్కిన్	192.00
స్కిన్ లెస్	202.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

పోలీసు క్రీడా మైదానంపై నిర్లక్ష్యపు క్రీనీడ

» ఒకప్పుడు భారీ టోర్నమెంట్లు నిర్వహణ
» నేడు తుప్పలు, గోతులతో కళావిహీనం
» వర్షం వస్తే చెరువులా మారుతున్న వైనం


వర్షం వస్తే నీరు చేరి చెరువులా తయారైన దృశ్యం

మాడుగుల, ఆగస్టు 28:

ఒకప్పుడు అందుబాటులో ఉంటూ కళకళలాడిన పోలీసు క్రీడా మైదానం నేడు నిరుపయోగంగా మారిపోయింది. తుప్పలు నిండి, వర్షం కురిస్తే నీరు చేరి జలమయంగా మారింది. భారీ క్రీడా మైదానంపై నిర్లక్ష్యం క్రీనీడ పడడంతో యువత, విద్యార్థులకు ఆడుకునే అవకాశమే లేకుండా పోతోంది.

మాడుగుల మోదకొండమ్మ అమ్మ వారి ఆలయానికి వెళ్లే దారిలో భారీ విస్తీర్ణం కలిగిన పోలీస్ డ్రిల్ మైదానం తుప్పలతో నిండి ఉండేది. దీన్ని అప్పుడు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన ఎస్సై తారకేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రామంలోని కొందరు సీనియర్ క్రీడాకారులు, గ్రామ పెద్దల సహకారంతో క్రీడా మైదానం తీర్చిదిద్దారు. స్థానిక యువత, విద్యార్థులకు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించే ఉద్దేశంతో ఇక్కడ కొన్ని క్రీడా పరికరాలను సైతం అమర్చారు. స్థానిక


మైదానంలో ఆటలు ఆడుతున్న బాలబాలికలు (ఫైల్)

విద్యార్థులకు బాల్ బ్యాడ్మింటన్ కిట్లు కొనుగోలు చేసి అందించి ఉచితంగా శిక్షణ అందించారు. ఉత్తరాంధ్ర స్థాయిలో బాల్ బ్యాడ్మింట్ పోటీలు సైతం ఈ మైదానంలో ఘనంగా నిర్వహించారు. తరచూ వివిధ క్రీడా పోటీలు నిర్వహించేవారు. ఇక్కడ పలువురు క్రీడల్లో గెలుపొంది ఉన్నతాధికారు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

అయితే ఎస్సై తారకేశ్వరరావు బదిలీ కావడంతో క్రీడా నిర్వహణ బాధ్యతను చూసే వారే కరువయ్యారు. దీంతో క్రమేపీ మైదానం కళ కోల్పోయింది. తుప్పలు పెరిగాయి. గోతులు ఏర్పడడంతో వర్షం వస్తే నీరు చేరి చెరువును తలపిస్తున్నది. ప్రస్తుతం ఈ క్రీడా మైదానం పరిస్థితి దీనంగా ఉంది. పట్టించుకునే వారే లేకుండా పోయారు.

ఈ క్రీడా మైదానానికి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. ఎందరో క్రీడాకారులు ఇక్కడ నుంచి రూపొందే అవకాశం ఉంటుందని పలువురు అంటున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ క్రీడా మైదానానికి అందుబాటులోకి తెచ్చి పూర్వ వైభవం వచ్చేలా కృషి చేయాలని కోరుతున్నారు.

తాండవ వంతెనపై కూలిన రక్షణ గోడ

» ఏమాత్రం ఆదమరచి ఉన్నా నదిలో పడడం ఖాయమని పలువురు ఆందోళన
» ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని వేడుకోలు


వంతెనపై రక్షణ గోడ కూలిన దృశ్యం

పాయకరావుపేట, ఆగస్టు 28: ఇక్కడి తాండవ నదిపై గల వంతెనకు ఒక వైపు ఉన్న రక్షణ గోడ ప్రమాదకరంగా మారింది. కాకినాడ, అనకాపల్లి జిల్లాల సరిహద్దుగా పాయకరావుపేట, తుని పట్టణాల మధ్య ప్రవహిస్తున్న తాండవ నదిపై ఉన్న వంతెన రెండు పట్టణాల ప్రజల రాకపోకలతో పాటు వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. 1990లో వచ్చిన తుఫాన్ కారణంగా పాయకరావుపేట, తుని పట్టణాల మధ్య తాండవ నదిపై ఉన్న బ్రిటీష్ కాలంనాటి వంతెన కూలిపోయింది. దీంతో అప్పట్లో కొత్తగా వంతెన నిర్మించారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ వంతెనకు ఇరువైపులా రక్షణగా ఐరన్ రైలింగ్ ఏర్పాటుచేశారు. అనంతర కాలంలో ఐరన్ రైలింగ్ తుప్పుపట్టి ఎక్కడికక్కడ కూలిపోతుండడంతో ఆయా ప్రదేశాల్లో ఇటుకలతో రక్షణ గోడ నిర్మించారు. ప్రస్తుతం ఇవి శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల కురిసిన వర్షానికి మంగళవారం రాత్రి సుమారు 20 మీటర్లమేర గోడ కూలిపోయింది. దీంతో వాహనదారులు ఏమాత్రం ఆదమరచి ఉన్నా సుమారు 30 అడుగుల కింద నదిలో పడిపోవడం ఖాయమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు పట్టణాల మధ్య ఉన్న ఈ వంతెనపై నిత్యం ఆర్టీసీ, స్కూల్, వివిధ కంపెనీ బస్సులతో పాటు ఆటోలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని పలువురు హడలిపోతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తాండవ వంతెనపై రక్షణ గోడ కూలిన చోట కొత్తగా గోడ నిర్మించాలని అంతా కోరుతున్నారు.

'అనకాపల్లి' టైటిల్‌తో కొత్త చిత్రం

» వెంకటేశ్వర థియేటర్‌లో హీరో, హీరోయిన్లపై పలు సన్నివేశాలు చిత్రీకరణ


హీరో విక్రమ్, కథకుడు నక్కినను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

అనకాపల్లి టౌన్, ఆగస్టు 28: పట్టణంలో బుధవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ఇక్కడి స్టేషన్ రోడ్డులోని వెంకటేశ్వర థియేటర్‌లో నక్కిన నేరేటివ్స్ ప్రొడక్షన్‌లో 'అనకాపల్లి' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఖగేష్ తమ్మినేని దర్శకత్వంలో విక్రమ్, సంధ్య హీరో హీరోయిన్లుగా, తారక్ పొన్నప్ప (కేజీఎఫ్ విలన్) తారాగణంతో ప్రేమకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ తెరకెక్కించారు. ఇటు ప్రముఖ హీరో మహేష్‌బాబు నటించిన బిజినెస్‌మెన్ సినిమా విడుదల రోజున అభిమానుల కోలాహలం, అటు హీరో హీరోయిన్లు కలయిక వంటి సన్నివేశాలు చిత్రీకరణ వెరసి కోలాహల వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా చిత్ర నిర్వాహకులు మాట్లాడుతూ అనకాపల్లి అనే టైటిల్ నేపథ్యంలో ప్రేమకథా చిత్రాన్ని ప్రేక్షకులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే నక్కిన త్రినాథరావు, సంగీతం దేవ్‌జాండ్, ఎడిటింగ్ ప్రవీణ్ పూడి, కెమెరా వంశీలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర షూటింగ్ జరుగుతున్న వెంకటేశ్వర థియేటర్‌ను సందర్శించారు. అనంతరం పీలా మాట్లాడుతూ సినిమా టైటిల్ అనకాపల్లి అని పెట్టడం సంతోషం కలిగించిందన్నారు. ఈ చిత్రాన్ని ఇక్కడ చిత్రీకరిస్తున్నందుకు, అలాగే, అనకాపల్లిలో ఉన్న కళాకారులకు అవకాశం ఇస్తున్నందుకు చిత్ర బృందాన్ని అభినందించారు. హీరో విక్రమ్, కథకుడు నక్కిన త్రినాథరావులను సత్కరించారు.

అనాథాశ్రమాల్లో అధికారుల బృందం తనిఖీలు


తామరంలోని అనాథాశ్రమంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మాకవరపాలెం, ఆగస్టు 28: ఇమ్మాన్యూయేలు సంస్థ నిర్వహిస్తున్న కొండలఅగ్రహారం, తామరం గ్రామాల్లో ఉన్న అనాథ ఆశ్రమాలను అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. ఇటీవల కోటవురట్లలో అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు చిన్నారులు మృతి చెందిన ఘటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ సందర్భంగా తాజాగా అనాథాశ్రమాల్లో తనిఖీలు నిర్వహించిన అధికారుల బృందం అక్కడి వంటగది, పరిశుభ్రత, పరిసరాలు, మెనూ నిర్వహణ, భోజన నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. అయితే తనిఖీలకు వస్తున్నట్టు అధికారులు ముందుగా ఆశ్రమాల నిర్వాహకులకు సమాచారం ఇవ్వడంతో వారంతా అప్రమత్తం అయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలాకాకుండా ఆకస్మిక తనిఖీలు చేపడితే అసలు రంగు బయట పడుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ తనిఖీ బృందంలో టీడీ శంకరరావు, ఎస్ఐ. రామకృష్ణారావు, ఎంఈవో మూర్తి తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల, ఆగస్టు 28 : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో అనకాపల్లి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణతో కలిసి బుధవారం ఆమె పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఒక కళాశాల నుంచి ఎంతమంది విద్యార్థులైనా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకుని క్విజ్ పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. సెప్టెంబరు 17వ తేదీలోపు విద్యార్థులు తమ దరఖాస్తులో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. స్టేట్ రౌండ్‌కు ప్రథమ బహుమతిగా రెండు లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.లక్షా 50వేలు, తృతీయ బహుమతిగా రూ.లక్ష అందించనున్నారని వివరించారు. అలాగే జోనల్ రౌండ్‌కు మొదటి బహుమతిగా రూ.ఐదు లక్షలు, రెండవ బహుమతిగా రూ.నాలుగు లక్షలు, మూడవ బహుమతిగా రూ.మూడు లక్షలు ఉంటుందన్నారు. నేషనల్ ఫైనల్ రౌండ్‌లో మొదటి బహుమతిగా రూ.10 లక్షలు, రెండవ బహుమతిగా ఎనిమిది లక్షలు, మూడో బహుమతిగా ఆరు లక్షలు అందించనున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని డిగ్రీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

నెల్లిపూడి సర్పంచ్‌పై కేసు

నక్కపల్లి, ఆగస్టు 28 : మండలంలోని నెల్లిపూడి గ్రామ సర్పంచ్ కె.సరేష్‌పై కేసు నమోదు చేసినట్టు నక్కపల్లి ఎస్ఐ సన్నిబాబు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన గూడుపు అప్పారావు అనే వ్యక్తి తనను తరచూ దూషిస్తున్నాడనే నెపంతో సర్పంచ్ కె.సురేశ్ మంగళవారం రాత్రి అప్పారావును నిలదీసి, వాటర్ బాటిల్‌తో కొట్టినట్టు బాధితుడు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు సర్పంచ్‌పై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

బాధిత కుటుంబానికి జన సైనికుల ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న జనసైనికులు

దేవరాపల్లి, ఆగస్టు 28 : మండలంలోని మారేపల్లిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన అల్లు అప్పారావు కుటుంబానికి జనసైనికులు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాయపురెడ్డి కృష్ణ, మండల అధ్యక్షుడు గొర్రుపోటు రామ్మూర్తినాయుడు సమకూర్చిన రూ.ఇరవై వేలు నగదును మారేపల్లి గ్రామ జనసేన వీర మహిళ సత్యవేణి, అందజేశారు. అంజిబాబు, ప్రసాదు, మోహన్, రామారావు, మోహన్, ఈర్లె.రాము, చిన్నమ్మలు, మంగ, కృష్ణ పాల్గొన్నారు.

నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 28: జిల్లాలో నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ జీవీ రమణకుమార్ తెలిపారు. ఇక్కడి డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను డీఎంహెచ్‌వో బాలాజీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణకుమార్ మాట్లాడుతూ ఈనెల 25 నుంచి సెప్టెంబరు ఎనిమిదో తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని జరుపుతామన్నారు. జిల్లావ్యాప్తంగా కరపత్రాలు పంపిణీ చేయడం, నేత్రదాన ప్రమాణ పత్రాలు సేకరిస్తుండడం వంటివి చేస్తున్నట్టు చెప్పారు. పీహెచ్‌సీల్లో, ఉన్నత పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. 2022-23 సంవత్సరంలో 51మంది, 2023-24లో 60 మంది, 2024-25 ఆగస్టు వరకు 58 మంది నేత్ర దానం చేశారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీలు, జేసీబీ స్వాధీనం


పోలీసులు పట్టుకున్న ఇసుక తరలిస్తున్న లారీలు

నక్కపల్లి, ఆగస్టు 28 : మండలంలోని డీఎల్‌పురం నుంచి అక్రమంగా సముద్రపు ఇసుకను తరలిస్తుండగా పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మండలంలోని కారిడార్ భూముల్లోని డీఎల్‌పురం తీర ప్రాంతంలో సముద్రపు ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తున్నారంటూ మంగళవారం 'ఇసుక తోడేళ్లు'శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై అధికారులు స్పందించారు. ఎస్ఐ సన్నిబాబు తన సిబ్బందితో కలిసి డీఎల్‌పురం పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఇసుకను తరలిస్తున్న రెండు లారీలు, ఒక జేసీబీని పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించారు. ఆయా యజమానులకు తహసీల్దార్ జరిమానా విధించినట్టు సీఐ కుమారస్వామి తెలిపారు. సముద్రపు ఇసుకను ఎవరైనా అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

'సింహాద్రి' రెండో యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, ఆగస్టు 28: సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో ఉత్పత్తిని మంగళవారం అర్ధరాత్రి పునరుద్ధరించారు. ఈ యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆదివారం ఉదయం ఉత్పత్తి అర్ధంతరంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం ప్లాంట్‌లో అన్ని యూనిట్‌ల్లో ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతుందని అధికారులు వివరించారు.

ఆశ్రమ పాఠశాలల గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం కార్యవర్గం

మాడుగుల రూరల్, ఆగస్టు 28 : అనకాపల్లి జిల్లా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఎన్నికలు ఇటీవల జరిగినట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బావరాజు తెలిపారు. కోనాం ఆశ్రమపాఠశాల హెచ్ఎం యూవీ రమణమూర్తి జిల్లా అధ్యక్షులుగా, తాటిపర్తి ఆశ్రమపాఠశాల హెచ్ఎం ఎస్ఎస్ రమాదేవి జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు : పరమేశ్వరరావు


పార్టీ నేతలతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

ఎలమంచిలి, ఆగస్టు 28 : వచ్చే నెల రెండో తేదీన ప్రారంభం కానున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇక్కడి ప్రాంతీయ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలో బుధవారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ప్రతి బూత్‌స్థాయి నుంచి పార్టీ సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. ఇందుకోసం కమిటీ ప్రతినిధులుగా పప్పు ఈశ్వరరావు, రామకృష్ణరాజు, పిట్టా దాసుబాబులను నియమించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జీవీఎస్ వర్మ, రాజాన సత్యనారాయణ, గుర్రాల నగేష్, నక్కా శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

30న గెస్ట్ లెక్చరర్ల భర్తీకి ఇంటర్వ్యూలు

దేవరాపల్లి, ఆగస్టు 28 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టు నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రాధ తెలిపారు. బుధవారం ఇంటర్వ్యూకు అభ్యర్థులెవరూ రాకపోవడంతో ఈ నెల 30న మళ్లీ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు. జువాలజీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించి నియామకాలు చేపడుతున్నట్టు చెప్పారు. అభ్యర్థులు సంబంధిత అంశంలో 50 శాతం మార్కులతో పీజీ చేసి ఉండాలన్నారు. ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

3 నెలల్లో విశాఖ ఉక్కును ట్రాక్‌లో పెడతా

» వర్కింగ్ కేపిటల్ రూ.7,500 కోట్లు అవసరం : సీఎండీ అతుల్ భట్

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రాబోయే మూడు నెలల్లో ట్రాక్‌లో పెడతానని సీఎండీ అతుల్ భట్ హామీ ఇచ్చారు. ప్లాంటులో కార్మిక సంఘాలతో బుధవారం సుమారు మూడు గంటలసేపు సమావేశం నిర్వహించి తాజా పరిస్థితిపై చర్చించారు. తన పదవీ కాలం ఇంకా మూడు నెలలే ఉందని, ఈలోగా సమస్యలన్నీ పరిష్కరిస్తానన్నారు. ప్లాంటును 100 శాతం సామర్థ్యంతో నడిపించాలంటే రూ.7,500 కోట్లు వర్కింగ్ కేపిటల్ (నిర్వహణ మూలధనం) అవసరమని, దానిని సమకూర్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇది కష్టకాలమని, కార్మిక సంఘాలు, అధికారులు యాజమాన్యంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉత్పత్తి తగ్గడంలో ఎవరి తప్పు లేదని, ముడి పదార్థాల కొరతే కారణమన్నారు. గురువారం నుంచి ప్రతి రోజు ఐదు ర్యాక్‌లతో ఐరన్ ఓర్ పంపించడానికి ఎన్ఎండీసీ అంగీకరించిందన్నారు. ఎక్కువ ఉత్పత్తి చేస్తే తప్ప ఉత్పత్తి వ్యయం తగ్గదన్నారు. గంగవరం పోర్టులో అటాచ్‌మెంట్‌లో ఉన్న కోకింగ్ కోల్‌ను రెండు, మూడు రోజుల్లో విడిపిస్తామన్నారు.



క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఎంహెచ్‌వో

విద్యార్థి దశలోనే వ్యాధులపై అవగాహన ఉండాలి

▸▸ డీఎంహెచ్‌వో జమాల్ బాషా

పాడేరు రూరల్, ఆగస్టు 28: విద్యార్థి దశలోనే సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అవగాహన పెంచుకోవాల్సి అవసరం ఉందని డీఎంహెచ్‌వో జమాల్ బాషా సూచించారు. స్థానిక జీటీడబ్ల్యూఏ పాఠశాలలో బుధవారం యూత్ ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా 8, 9 తరగతుల విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన పి.గౌతమ్‌నాయుడుకు, ఎ.సింహాద్రికి, పి.చరణ్‌రాజుకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణపై విద్యార్థులు అవగాహన పెంచుకొని పాఠశాలకు సెలవుల సమయంలో స్వగ్రామాలకు వెళ్లి ప్రజలకు అవగాహన వివరించాలని చెప్పారు. అలాగే చిన్నపాటి అనారోగ్యానికి గురైనా నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్య పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సీపీఎం రామచందర్, డీఎండీవో చిరంజీవి, జీటీడబ్ల్యూ స్కూల్ హెచ్‌ఎం జీవీ.ప్రసాదరావు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల నుంచి రక్షణ కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచు త్రినాథ్, ఇతర నాయకులు

ముంచంగిపుట్టు, ఆగస్టు 28: పోలీసుల నుంచి ఆదివాసీలకు రక్షణ కల్పించాలని లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్, పలువురు నాయకులు డిమాండ్ చేశారు. లక్ష్మీపురం, బుంగాపుట్టు పంచాయతీలకు చెందిన ముఖ్య నేతలు, పలు గ్రామాల ప్రజలతో లక్ష్మీపురంలో బుధవారం సమావేశమయ్యారు. గంజాయితో పాటు వివిధ కుంటి సాకులు చెబుతూ పోలీసులు పలువురిపై చేస్తున్న భౌతిక దాడులు, అక్రమ కేసులపై చర్చించారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే అకారణంగా చిత్రహింసలకు గురి చేయడం సరికాదన్నారు. ఎస్‌ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో అర్ధ రాత్రి వేళల్లో తరచూ రెండు గ్రామాలకు వచ్చి ఆదివాసీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు గంజాయి పేరుతో భౌతిక దాడులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల లక్ష్మీపురం పంచాయతీకి చెందిన ఒక గిరిజన యువకుడిపై ఎస్‌ఐతో పాటు పలువురు పోలీసులు విచక్షణ రహితంగా కొట్టారని ఆరోపించారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ అక్రమ కేసులు బనాయించడం, విచక్షణ రహితంగా దాడులకు దిగుతుంటే తమ బాధను ఎవరికి చెప్పుకోవాలని ఆయన ప్రశ్నించారు. పోలీసుల నుంచి తమకు రక్షణ కల్పించేలా జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్, ఎస్పీలు చూపాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వి.సాధురామ్, వార్డు సభ్యులు ఎస్.సోద, త్రినాథ్, హరి, రెండు పంచాయతీల ముఖ్య నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

ప్రజా సేవలో అధికారులు నిర్లక్ష్యం

▸▸ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

డుంబ్రిగుడ, ఆగస్టు 28: ప్రజా సేవలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బి.ఈశ్వరి అధ్యక్షత బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో విద్యా వ్యవస్థ అధ్వానంగా ఉందని, మెనూ కూడా సక్రమంగా అమలు కావడం లేదని చెప్పారు. గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలను సహించేది లేదన్నారు. అలాగే పర్యాటక కేంద్రాల్లో ధరలు తగ్గించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, వైస్ ఎంపీపీలు ఆనంద్, లలిత, తహసీల్దార్ నాగమ్మ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రంపచోడవరం సబ్ కలెక్టర్ బదిలీ

రంపచోడవరం, ఆగస్టు 28: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం సబ్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన్ను విజయవాడలోని కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనరుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



వాలీబాల్ పోటీలో తలపడుతున్న విద్యార్థినులు

పాడేరు రూరల్, ఆగస్టు 28: తలారిసింగి క్రీడా మైదానంలో బుధవారం వివిధ క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఫుట్‌బాల్, ఖో-ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఆర్చరీ, హాకీ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హాకీ పోటీల్లో ప్రథమ స్థానాన్ని అరకు స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు కైవసం చేసుకోగా, ద్వితీయ స్థానంలో సీఏహెచ్.స్కూల్ విద్యార్థులు నిలిచినట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.జగన్మోహన్‌రావు తెలిపారు. అలాగే ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం సీఏహెచ్.స్కూల్ బాలురు, ద్వితీయ బహుమతి లోచలిపుట్టు పాఠశాల బాలురు, ఖో-ఖో ప్రథమ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ద్వితీయ బహుమతిని సీఏహెచ్.స్కూల్ బాలురు నిలిచినట్టు చెప్పారు. విజేతలకు కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ తలారిసింగి పాఠశాల ఆవరణలో గురువారం బహుమతులను అందిస్తారని తెలిపారు.

సీతాఫలం ధర పతనం

... 5వ పేజీ తరువాయి

ధర బాగానే పలికింది. క్రేట్ ధర రూ.700 నుంచి రూ.800లకు పలకడంతో రైతులు ఆనందించారు. అయితే ఈ వారం రూ.150 నుంచి రూ.200కు ధర పడిపోవడంతో డీలా పడ్డారు. కాగా కాశీపట్నం వారపు సంతకు ఎస్‌ఆర్‌పురం, పెదకొనెల, డెంజంగివలస, బూడుమామిడి, బూడ్డెవలస, పెద్దూరు, డి.కోటపర్తి, గొడుగుమామిడి, తదితర గ్రామాల నుంచి సీతాఫలం వచ్చాయి. ఇక్కడ ఈ నెల మొదటి వారం నుంచి మూడవ వారం వరకు క్రేట్ ధర రూ.900 నుంచి రూ.1000 వరకు పలికింది. ఈ వారం మాత్రం రూ.700 నుంచి రూ.800ల వరకు పలికింది. దీంతో ఈ సంతకు సీతాఫలాలు తెచ్చిన రైతులు ఊరట చెందారు.

కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కలేదు



ఈ నెలలో డముకు వారపు సంతలో మొదటి మూడు వారాలు గిట్టుబాటు ధర పలికింది. అయితే ఈ వారం మాత్రం కనీసం కూలి ఖర్చులు కూడా రాలేదు. కష్టానికి తగ్గ ప్రతిఫలం రాలేదు. తట్ట సీతాఫలాలు రూ.100లకు విక్రయించాల్సి వచ్చింది.

- దాలమ్మ, మేడపర్తి, గిరి మహిళ

బేస్‌లైన్ పరీక్షలతో లోపాలు సరిదిద్దండి

జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్

కోట్లగరువులో పాఠశాల భవనం ప్రారంభం



పాఠశాల భవనం ప్రారంభిస్తున్న కలెక్టర్

పాడేరు రూరల్, ఆగస్టు 28: బేస్‌లైన్ పరీక్షల్లో విద్యార్థుల లోపాలను గుర్తించి సరిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని కోట్లగరువు గ్రామంలో రూ.5 లక్షలతో పునర్నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. మౌలిక సదుపాయాలు లేకపోయినా పర్వాలేదని, పిల్లలకు పాఠశాల ముఖ్యమని తీర్మానించుకొని పాఠశాల పునర్నిర్మాణానికి గ్రామస్థులు ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. తల్లిదండ్రుల సమావేశాలకు హాజరై పిల్లల్లో నమ్మకాన్ని, సత్ప్రవర్తనను అభివృద్ధి చేయాలని సూచించారు. గ్రామానికి అవసరమైన రహదారులు, కాలువలు, కల్వర్టులను ఎన్‌ఆర్‌ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ మారుమూల పాఠశాలల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు పాఠశాలను వలంటీర్లకు విడిచిపెట్టి గైర్హాజరవుతున్నారని ఆరోపించారు. అటువంటి వారిపై చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి, ఎంపీడీవో కె.సాయినవీన్, ఎంఈవో సరస్వతీదేవి, సర్పంచ్ రమణమ్మ పాల్గొన్నారు.

పంటల తెగుళ్లను సకాలంలో గుర్తించాలి

▸▸ డీఆర్‌సీ సలహా మేరకు నివారణ చర్యలు చేపట్టాలి

▸▸ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు జాహ్నవి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ జాహ్నవి

చింతపల్లి, ఆగస్టు 28: రైతులు పంటలను నష్టపోకుండా క్షేత్ర స్థాయిలో తెగుళ్లు, చీడపీడలను సకాలంలో గుర్తించి డీఆర్‌సీ సలహా మేరకు నివారణ చర్యలు చేపట్టేందుకు వ్యవసాయ సిబ్బంది కృషి చేయాలని స్థానిక వ్యవసాయ సహాయక సంచాలకులు (ఏడీఏ) కంటా జాహ్నవి సూచించారు. బుధవారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సమావేశమందిరంలో ఆత్మ ఆధ్వర్యంలో సీఎల్ఎస్ యాప్ వినియోగంపై సచివాలయ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏడీఏ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ, ఉద్యాన సహాయకులు ఎప్పటికప్పుడు రైతుల పంట పొలాలను పరిశీలిస్తుండాలన్నారు. పంటలో తెగులు, చీడపీడలు కనిపిస్తే వెంటనే వ్యవసాయాధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులు సమాచారం ఇచ్చిన పంట పొలాన్ని సందర్శించి తెగులు, చీడపీడల వివరాలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పంటను ఆశించిన తెగులు, చీడపీడల చిత్రాలను తీసి సీఎల్ఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయడం వల్ల జిల్లా రిసోర్సు సెంటర్ వ్యవసాయ నిపుణులు క్షుణ్ణంగా పరిశీలించి నివారణ చర్యలను సూచిస్తారని చెప్పారు. సీఎల్ఎస్ యాప్ వల్ల తెగుళ్లు, చీడపీడలకు కచ్చితమైన నివారణను నిపుణులు తెలియజేస్తారన్నారు. దీంతో సకాలంలో పంట పొలాల్లో ఆశించిన తెగుళ్లు, చీడపీడలను నియంత్రించుకుని పంటలను కాపాడుకోవచ్చునన్నారు. ప్రధానంగా ఖరీఫ్ పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన సహాయకులు క్షేత్ర స్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి ఎం.విజయలక్ష్మి, ల్యాబ్ వ్యవసాయ అధికారి శోభ, జీకేవీధి, చింతపల్లి వ్యవసాయ అధికారులు మధుసుదనరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియ నిలిపివేయండి

▸▸ సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స



అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు అప్పలనర్స తదితరులు

పాడేరు రూరల్, ఆగస్టు 28: వ్యవసాయ పంపుసెట్లు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యుత్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా కమ్యూనిస్టు పార్టీలు నిర్వహించిన ఉద్యమంలో అప్పటి ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించి ఉద్యమకారులపై కాల్పులు జరపడంతో ముగ్గురు కార్యకర్తలు మరణించారన్నారు. బీజేపీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగి రాష్ట్రంలోని నివాస గృహాలకు విద్యుత్ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు ఏర్పాటు చేయాలని గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

ఇందుకు సంబంధించి అదానీ, షిరిడిసాయి తదితర కంపెనీలకు కాంట్రాక్టులను కట్టబెట్టిందని ఆరోపించారు. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని నాడు ప్రతి పక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ వ్యతిరేకించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నేడు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ఒప్పందాలను రద్దు చేయకుండా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రక్రియకు సిద్ధం కావడం అన్యాయమని ఆయన వాపోయారు. బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనాలు కల్పించే ఉద్దేశంతో కేంద్రం ఈ స్మార్ట్ మీటర్లను రాష్ట్ర ప్రజలపై రుద్దుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఇప్పటికే బిగించిన మీటర్లను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎల్.సుందరరావు, పి.బాలదేవ్, ఎస్.ధర్మన్నపడాల్, చిన్నారావు, సింహాద్రి పాల్గొన్నారు.

బదిలీల కోసం..

... 5వ పేజీ తరువాయి

చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరైతే ఒకరి సిఫారసు లేఖతో సంతృప్తిచెందకుండా తమకున్న పలుకుబడి ఉపయోగించి ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేల నుంచి లేఖలు సంపాదిస్తున్నారు. ఆ లేఖలను సంబంధిత అధికారులకు సమర్పించడంతోపాటు అవి ఇచ్చిన ప్రజా ప్రతినిధులతో ఫోన్లు చేయించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా బదిలీలు జరగనున్నందున ఏజెన్సీ, మైదానం నుంచి ఎక్కువ మంది నగర పరిసరాల్లో పోస్టింగ్స్‌కు యత్నిస్తున్నారు.

ఒకేచోట ఐదేళ్లు సర్వీస్ పూర్తిచేసుకున్న అధికారి/ఉద్యోగికి బదిలీ తప్పనిసరి. అయితే సర్వీస్‌తో నిమిత్తం లేకుండా బదిలీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందుకు ఈ నెల 24వ తేదీతో గడువు ముగిసినా వరుస సెలవుల కారణంగా దరఖాస్తులు ఇంకా స్వీకరిస్తున్నారు. ఈ నెలాఖరులోగా బదిలీలు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగంలో మంగళవారం అర్ధరాత్రి వరకు బదిలీలు నిర్వహించారు.

ఎంపీడీవో పోస్టులకు పైరవీ..

ఉమ్మడి జిల్లాలోని 39 మండలాల్లో ఐదేళ్లు సర్వీస్ పూర్తిచేసుకున్న ఎంపీడీవోలు ఆరేడుగురు మాత్రమే ఉన్నారు. ఐదేళ్ల సర్వీస్ పూర్తికాకపోయినా పలువురు ఎంపీడీవోలు కీలక మండలాల్లో పోస్టింగ్‌కు యత్నిస్తున్నారు. దీనికి ప్రజాప్రతినిధుల నుంచి లేఖలు తెచ్చుకున్నారు. ప్రజా ప్రతినిధులు కూడా స్వయంగా రంగంలోకి దిగి తమకు అనుకూలంగా ఉండే ఎంపీడీవో నియామకం కోసం పట్టుపడుతున్నారు. అయితే జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలోని కమిటీయే ఎంపీడీవోల నుంచి కిందిస్థాయి ఉద్యోగి వరకు బదిలీలు చేపట్టాలి. బదిలీల కోసం సుమారు 160 వరకు దరఖాస్తులు వచ్చాయని చెబుతున్నారు.

జిల్లాలో ఒకరిద్దరు తహసీల్దార్లకు స్థాన చలనం

రెవెన్యూ శాఖలో బదిలీల కోసం ఉమ్మడి విశాఖ జిల్లాలో 70 నుంచి 80 మంది దరఖాస్తు చేశారని తెలిసింది. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లు పలువురు విశాఖ రావడానికి ఆయా జిల్లా కలెక్టర్లకు దరఖాస్తు చేసుకున్నారు. ఏజెన్సీలో ఉన్న ఉద్యోగులు...ముఖ్యంగా 50 సంవత్సరాల వయస్సు పైబడినవారు మైదానం/నగరంలో పోస్టింగ్ ఇవ్వాలని కోరుతున్నారు. విశాఖ జిల్లాలో రెండు తహసీల్దార్ల పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. ఇంకా జిల్లాలో ఒకరిద్దరు తహసీల్దార్లకు బదిలీ ఉంటుందనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో పలువురు తహసీల్దార్లు రాజకీయ నాయకుల ద్వారా కలెక్టర్‌కు సిఫారసు చేయించారని తెలిసింది.

చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు గిరాకీ

నగరంలో పౌర సరఫరాల శాఖలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు గిరాకీ ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరంలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లుగా రావాలని ప్రజా ప్రతినిధుల నుంచి పలువురు సిఫారసు లేఖలు సమర్పించారు. నగరంలో పనిచేస్తున్న చెకింగ్ ఇన్‌స్పెక్టర్ ఒకరు 20 మంది డీలర్లను తీసుకుని ఒక ఎమ్మెల్యే వద్దకు వెళ్లి మరీ లేఖ తీసుకున్నారు. ఐదేళ్ల సర్వీస్ దాటినవారు కూడా ఇక్కడే కొనసాగించాలని ఎమ్మెల్యేల నుంచి సిఫారసు లేఖలు తెచ్చుకుంటున్నారు. ఎనిమిది నుంచి పదేళ్లుగా నగరంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు కూడా కదలడానికి ససేమిరా అంటున్నారు. పలు వివాదాలతో గ్రామీణ ప్రాంతానికి బదిలీ అయిన ఉద్యోగి ఆనందపురం ఆర్‌ఐగా రావాలని పైరవీ చేస్తున్నారు. ఒకసారి ఆర్‌ఐగా పనిచేసిన వ్యక్తిని రెండోసారి అదే పోస్టులో నియమించకూడదు. కానీ నగరం నుంచి బియ్యం ఆనందపురం మీదుగా ఇతర ప్రాంతాలకు వెళుతున్నందున అక్కడ పోస్టింగ్ దక్కితే దండిగా సంపాదించుకోవచ్చునని కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పౌర సరఫరాల శాఖలో తిష్ఠ వేసిన ఇన్‌స్పెక్టర్లను సాగనంపాలని రెవెన్యూ ఉద్యోగులు కోరుతున్నారు. చెకింగ్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న వారిలో పలువురిపై ఆరోపణలు ఉన్నాయి.

ఎట్టకేలకు రహదారుల విస్తరణకు మోక్షం

... 5వ పేజీ తరువాయి



అరకులోయ వైపు ఇరుకుగా ఉండే పాడేరు మెయిన్ రోడ్డు

అథారిటీతో చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకు జాతీయ రహదారి 516-ఈ పనులు జరుగుతుండడంతో ఈ తరుణంలో పాడేరు మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు సైతం నేషనల్ హైవే అథారిటీకే అప్పగిస్తే సజావుగా పనులు జరుగుతాయని కూటమి ప్రభుత్వం భావించింది. దీంతో రెండు రోజుల క్రితం నేషనల్ హైవే అథారిటీకి చెందిన అధికారులు రంగంలోకి దిగారు. అంబేడ్కర్ కూడలి నుంచి మూడు వైపులా ఉన్న మెయిన్ రోడ్డు స్థితిగతులను పరిశీలించడంతో పాటు చింతపల్లి వైపు ఉన్న రోడ్డుకిరువైపులా ఇళ్లు, దుకాణదారులకు నోటీసులను జారీ చేశారు. అలాగే రోడ్ల విస్తరణలో ఇల్లు, స్థలాలను కోల్పోయిన వారందరికీ పక్కాగా నష్టపరిహారం అందిస్తామని అధికారులు చెబుతున్నారు.

మెయిన్‌రోడ్డు విస్తరణ ప్రతిపాదన ఇది..

జిల్లా కేంద్రంలో మెయిన్‌రోడ్ల విస్తరణలో భాగంగా స్థానిక అంబేడ్కర్ కూడలి సెంటర్ పాయింట్‌గా అటు అరకులోయ వెళ్లే మార్గం, ఇటు విశాఖపట్నం వెళ్లే రోడ్డు, మరో వైపు చింతపల్లి వెళ్లే రహదారి ఉంది. అంబేడ్కర్ సెంటర్ నుంచి ఆయా మూడు మార్గాల్లోని మెయిన్ రోడ్డును ఒక కిలోమీటర్ల దూరం వరకు విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. అలాగే ప్రస్తుతం పాడేరు నుంచి చింతపల్లి వెళ్లే రోడ్డు 21 అడుగులుండగా, అరకులోయ, విశాఖపట్నం వెళ్లే రోడ్లు 30 అడుగులు చొప్పున వెడల్పు ఉన్నాయి. దీంతో మూడు రోడ్లను 54 అడుగులుగా విస్తరించాలని, దానిలో ఇరువైపులా ఆరేసి అడుగుల చొప్పున(మొత్తం 12 అడుగులు) నడకదారి, మధ్యలో 42 అడుగుల తారురోడ్డు వేయాలని అధికారులు భావిస్తున్నారు. దీంతో ప్రస్తుతం ఉన్న రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 35 అడుగుల చొప్పున(మొత్తం 70 అడుగులు) స్థల సేకరణ చేపడుతున్నారు.

విస్తరణతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

పాడేరు మెయిన్‌రోడ్డు విస్తరణతోనే ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టగలమని చాలా కాలంగా అధికారులు భావిస్తున్నారు. పాడేరు జిల్లా కేంద్రం కావడంతో వాహనాల రద్దీ పెరిగింది. అలాగే విశాఖపట్నం నుంచి ఒడిశా రాష్ట్రానికి రాకపోకలు సాగించాలంటే పాడేరు మీదుగా వెళ్లాలి. ఈ క్రమంలో పాడేరు పట్టణంలో ప్రస్తుతం ఉన్న రోడ్లు ఇరుకుగా ఉండడంతో తరచూ ట్రాఫిక్ సమస్యతో పాటు, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పాడేరులోని మెయిన్ రోడ్లను విస్తరించాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది.

మన్యంలో జొల్ల సందడి

... 5వ పేజీ తరువాయి



పంట పొలాల్లోకి జొల్ల కొమ్మలను తీసుకువెళుతున్న పాతపాడేరు రైతు

రైతుల నమ్మకం. కాగా జొల్ల పండగ వెనుక శాస్త్రీయత దాగి ఉందని పలువురు అంటున్నారు. ఈ సంప్రదాయ పండగలో భాగంగా రైతులు పొలాల్లో పాతే మొక్కల కొమ్మలు ఔషధ మొక్కలకు చెందినవని గిరి రైతులు తెలిపారు. ఔషధ గుణాలు కలిగిన కస్కి, సీడి, పెద్ద జొల్ల మొక్కల కొమ్మలను పంట పొలాల్లో పాతడం వల్ల, లేత వరి పైరును ఆశించాలనుకునే పలు రకాల పురుగులను ఈ కొమ్మలు ఆకర్షించి వరి పంటను కాపాడతాయని పలువురు అంటున్నారు. అయితే సస్యరక్షణలో భాగంగా చేపట్టాల్సిన ఈ చర్యను సంప్రదాయం, ఆచారాల్లో కలిపి చేయడం వల్ల గిరిజనులు పండగగా భావించి, విధిగా దానిని పాటిస్తారనే ఆలోచనతో పూర్వీకులు జొల్ల పండగగా నామకరణం చేసి ఆచరిస్తున్నారని గిరిజన రైతులు చెబుతున్నారు.

☛ సంక్షిప్తంగా..

అగ్రికల్చర్ డిప్లొమా స్పాట్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ రేపు

▸▸ ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి

చింతపల్లి, ఆగస్టు 28: ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నికల్ కళాశాలల్లో స్పాట్ ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 30న గుంటూరు లాం ఫామ్‌లతో కౌన్సెలింగ్ జరుగుతుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలల్లో రెండేళ్ల కాల పరిమితి గల సేంద్రియ వ్యవసాయం, విస్తన సాంకేతిక విజ్ఞానం కోర్సులతో పాటు మూడేళ్ల కాల పరిమితి గల వ్యవసాయ ఇంజనీరింగ్ డిప్లొమా ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. అలాగే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని విద్యార్థులు సెప్టెంబరు 5న నిర్వహించే స్పాట్ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు హాజరుకావచ్చునన్నారు. ఇందుకోసం పదో తరగతి ఉత్తీర్ణత, ఇంటర్ ఫెయిల్ విద్యార్థులు అర్హులన్నారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఆదే రోజు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని ఆయన చెప్పారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు రూరల్, ఆగస్టు 28: విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం వివిధ మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం.అప్పారావు తెలిపారు. ముంచంగిపుట్టు మండలంలోని పెదగూడ ఫీడర్ పరిధిలో బాకులుపుట్టు, చుట్టుమూరుపుట్టు, కొండపాడు, పెదగూడ గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామన్నారు అదే విధంగా చింతపల్లి సబ్ స్టేషన్ లోతుగెడ్డ ఫీడర్ పరిధిలోని లోతుగెడ్డ జంక్షన్, చిన్నగెడ్డ, వంగసార గ్రామాలకు, కొయ్యూరు మండలం కాకరపాడు సబ్ స్టేషన్ పరిధిలోని కొయ్యూరు టౌన్ ఫీడర్‌లోని కాకరపాడు, సింగవరం, రాజేంద్రపాలెం, కొయ్యూరు గ్రామాలకు, అనంతగిరి మండలం భీమవరం సబ్ స్టేషన్ 33 కేవీ ఫీడర్ మరమ్మతులు నిమిత్తం భీమవరం, గుమ్మకోట, భీంపోలు, ఊటగెడ్డ, గరుగుపల్లి గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.

అరకులో ముసురు వాతావరణం

అరకులోయ, ఆగస్టు 28: అరకులోయలో బుధవారం సాయంత్రం ముసురు వాతావరణం నెలకొంది. రోజంతా మబ్బులు పట్టి ఉంది. సాయంత్రం వేళ కూడా ముసురు వాతావరణం ఉండడంతో జనం ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలి

చింతపల్లి, ఆగస్టు 28: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాలు పెట్టాలని తహసీల్దార్ టి.రామకృష్ణ ఆదేశించారు. చౌడుపల్లి ఎంపీయూపీ పాఠశాలను బుధవారం సందర్శించారు. తొలుత విద్యార్థుల ప్రగతి, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులకు పెట్టే భోజనాలను ప్రతీ రోజు రుచి చూడాలన్నారు. మెనూ కచ్చితంగా అమలు చేయాలన్నారు. విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, గణితం పాఠ్యాంశాల్లో పట్టు సాధించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే చౌడుపల్లి పాఠశాలను ఎంఈవో-1 పనసల ప్రసాద్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కుడుముల కాంతారావు పాల్గొన్నారు.

'చెక్‌డ్యామ్ మరమ్మతులపై నిర్లక్ష్యం'

కొయ్యూరు, ఆగస్టు 28: మండలంలో చీడిపాలెం పంచాయతీలోని చెక్‌డ్యామ్ మరమ్మతులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఐటీడీపీ ఇన్‌చార్జి కురుజు శ్రీను పేర్కొన్నారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ కాలనీలో చెక్‌డ్యామ్ మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని, అయినా పనులు ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ శాఖ పీఆర్ ఇంజనీరింగ్ విభాగంలో పనులకు ఇస్తున్న ప్రాధాన్యత, ఎస్ఎంఐకు ఇవ్వకపోవడం సరికాదన్నారు. మూడు శాఖలకు ముగ్గురు ఏఈలు ఉండాల్సి ఉండగా, ఒక్కరే అన్ని బాధ్యతలు నిర్వహించటమేమిటని ప్రశ్నించారు. ఈ సమస్యను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్లామని ఆయన సూచించారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి

చింతపల్లి, ఆగస్టు 28: సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు. మండలంలోని సంకాడ సంపద కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. పంచాయతీ సిబ్బంది సంపద కేంద్రంలో పది టన్నుల వర్మికంపోస్టు ఎరువు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించడం జరిగిందన్నారు. సంపద కేంద్రాల వల్ల పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. ప్రతి పంచాయతీలోనూ సంపద కేంద్రాలను వినియోగించాలన్నారు. నిరుపయోగంగా ఉండరాదన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈవోపీఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

కంతారం పీహెచ్‌సీకి తీరిన బెడ్ల కొరత



పీహెచ్‌సీకి సమకూరిన బెడ్లు, ఇన్వర్టర్

కొయ్యూరు, ఆగస్టు 28: కంతారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అదనపు బెడ్లు, ఇన్వర్టర్ సమస్య తీరిందని వైద్యాధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. మండల పర్యటనలో భాగంగా ఈ నెల 24న కంతారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులకు తగినన్ని బెడ్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయం పీవో దృష్టికి వెళ్లింది. అలాగే ఆరోగ్య కేంద్రానికి సరఫరా చేసిన ఇన్వర్టర్ మరమ్మతులకు గురికావడంతో విద్యుత్ సరఫరా లేని సమయాలలో పీహెచ్‌సీ చీకటి రాజ్యమేలుతున్నదని రోగులు పీవో దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాలపై స్పందించిన పీవో బుధవారం పీహెచ్‌సీకు ఆరు బెడ్లు, ఇన్వర్టర్ సరఫరా చేసినట్టు వైద్యాధికారిణి తెలిపారు. పీవో చొరవతో పీహెచ్‌సీకు బెడ్లు, ఇన్వర్టర్ కొరత తీరిందని ఆనందం వ్యక్తం చేశారు.